## మాఊరిస్వాగతం

పవిత్ర గోదావరి పశ్చిమ తీరంగా
పచ్చని పైరుల తోరణాల ద్వారంగా
కొల్లేటి విహంగాల బారుల పహారాగా
హేలాపురి దరిలో చాటనామం సింగారంగా
తెలుగువారి వెలుగై తేనెల తేటల మాటలతో స్వాగతం
పలుకుతుందిమాఊరు

ముత్యాల ముగ్గుల ముంగిళ్ళు
రత్నాల రాసుల రైతన్నలు
జాతి నేతల జ్ఞాపికలు
కీర్తి కెక్కిన దేవాలయం తీర్చిదిద్దే విద్యాలయం
భక్తి ప్రభోధలనిలయమై మధుర గీతాలాపనలతో స్వాగతం
పలుకుతుందిమాఊరు

దసరా వేషాల భోగాలు
సంక్రాంతి సంబరాల రోషాలు
రచ్చబండ రసజ్ఞు రాజకీయాలు
ఉత్సవాల వైభవాల ఊరేగింపులు
ఉత్సాహ వాహినై మేళతాళాల మేలుకలయికలతో స్వాగతం
పలుకుతుందిమాఊరు

స్వాతంత్ర యోధుల త్యాగశీలి
దానకర్ణుల ధర్మమూర్తుల దానశీలి
విద్యావంతుల సాహితీవేత్తల సారధి
కళాకారుల విరాళాల వేదిక
కళాంజలై కళకళలాడుతూ కరతాళ ధ్వనులతో స్వాగతం
పలుకుతుందిమాఊరు

నా భాష భావనల భావి పునాది
నాగేయ ధ్యేయాల తొలినాంది
నా ఆటపాటల చెలియలికట్ట
నా జీవనపోరాటంలో చెరగని ఘట్టం
నా జన్మభూమియే రమ్యభూమిగా చిరునవ్వులచిరు
జల్లులతో మరపురాని పులకరింతల స్వాగతం
పలుకుతూంది మాచాటపర్రు

## భోగం

చిరు జల్లుల రాక చిగురాకుల మొలక
గుచ్చుకునే కిరణాలు విచ్చుకునే పూబోతులు
పచ్చపచ్చని పరుపుల లానులు పడిమేసే లేడికూనలు
దొర్లే దొరలు పరుగుల పడుచువాళ్ళు
నడకల నడివయస్కుల చిందుల చిలిపివాళ్ళు
బైకిల బైబైల బుడ్డిగాళ్ళు
జలపాతాల జలకాలాటలు
తీరాలలో తీర్చుకునే ఆరాటాలు
సరసాల జంటలు సరదాల విందులు
పార్కుల కనువిందులు ఆనందపు హరివిల్లులు
వీకెండ్సుకు వెకేషన్సుకు వేసే ప్లానులు
సెకెండ్సులో నింపే కార్డులలో కాన్లు
బడాబాబుల బడాయి వాహనాల హోరులు జలసాలజోర్లు
ఎగిరేగువ్వలు తిరిగే ఊళ్ళు కదిలే బొమ్మల రీళ్ళు
చూసేవింతలు విచిత్రాలు పోయేచింతలు చికాకులు
రేయి అయినా గూటికి చేరుకోని సూరీడు
రివ్వున తెల్లవారకముందే లేచివస్తాడు
అందాల అమెరికా వేసవి వైభోగాలతో భోగమే

## యోగం

ఆకురాల్చి అలసి సొమ్మసిల్లి సొగసులేని చెట్లు
ముసురుకునే చీకట్లు ముసుగుల జాకెట్లు
కురిసే మంచు కసిరే ముక్కు
వణుకుల బెణుకుల వృద్ధులు
సణుగుల గొణుగుల పెద్దలు
ఆరుబయట ఆగిపోయే ఆటపాటలకేరింతలు
ఇక ఇంటిలోనే సాగిపోయే దాగుడుమూతలు
జారేదార్లు కదలని కార్లు
రహదారుల ఇక్కట్లు అధికారుల చీవాట్లు
ఆలుమగలకు చిట్టిపొట్టి చినారులతో అగచాట్లు
అప్పుడే వచ్చి అదరగొట్టే అతి పెద్దయిన ఫెస్టివల్స్
తెరలచాటున తస్కరుడిలా భాస్కరుడు తొంగితొంగి చూచి
దాగిపోవు
పగలు కూడ రాత్రిగా మార్చివేసి పరుగున పారిపోవు
చలిగిలి అయినా పులిగా మారితే అయోమయయోగమే మరి

**- ఝాన్సీ యలమంచి**